క్లుప్తంగా

8న బాలదాసులతో శ్రీవారి వ్రత పూజ



వేంకటేశ్వరస్వామికి హారతి ఇస్తున్న భక్తులు

బోట్‌క్లబ్: పూర్ణహృదయ ఆరాధనతో వేంకటేశ్వర స్వామివ్రతాన్ని నిర్వర్తించి ధర్మ పరివర్తనతో జీవితాన్ని ఆచరించే మానవ జన్మకు వంశపారం పర్యంగా ప్రకృతి పరమైన అనంత కోటి శుభ ఫలితాలు సిద్ధిస్తాయని గణపతి పీఠం ఉపాసకులు దూసర్లపూడి రమణరాజు పేర్కొన్నారు. శ్రీవారి 56వ జపయజ్ఞ పారాయణ సందర్భంగా శనివారం దూసర్లపూడి వారి వీధిలోని గణపతి పీఠంలో సప్తగిరులతో శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారి దశ కలశాలను ప్రతిష్ఠ చేసి గోవింద సహస్ర నామ పారాయణతో పుష్పార్చన నిర్వహించారు. వినాయకుడు, వేంకటేశ్వర స్వామి వార్లకు పంచామృతాలతో అభిషేకించారు. నవంబర్ 8న 58వ జపయజ్ఞ పారాయణగా బాలదాసులతో వేంకటేశ్వర స్వామి వ్రతం నిర్వహిస్తామన్నారు. శ్రీవారి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

కరపలో మెగా వైద్యశిబిరం

కరప: గ్రామంలోని కేజీహెచ్ నర్సింగ్‌హోంలో శనివారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. కరప పరిసర గ్రామాల నుంచి 200 మంది ఈ శిబిరానికి రాగా డాక్టర్ డేగల రాజేష్, డాక్టర్ కె.వెంకటలక్ష్మి బీపీ, సుగర్ తదితర వైద్యపరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ప్రతి బుధవారం వచ్చే ఓపీ పేషెంట్లకు ఉచితంగా వైద్యసేవలందించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

బీచ్‌లో ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు

కాకినాడ రూరల్: సూర్యారావుపేటలోని ఎన్టీఆర్ బీచ్‌లో పరిశుభ్రత పాటించడం ద్వారా పర్యావరణ పరిరక్షణతోపాటు పర్యాటకులకు ఆహ్లాదాన్ని అందించవచ్చని లయన్స్ క్లబ్ రీజియన్ చైర్‌పర్సన్ పద్మతులసి అన్నారు. బీచ్‌లో పేరుకుపోయిన ప్లాస్టిక్, పాలిథిన్ వ్యర్థాలను లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం తొలగించారు. లయన్స్ క్లబ్ రీజియన్ పరిధిలోని 16 క్లబ్‌ల ప్రెసిడెంట్, సెక్రటరీలు, కోశాధికారులు, సభ్యులు బీచ్ శుభ్రత పనుల్లో పాల్గొన్నారు. ముఖ్యఅతిథులుగా పాల్గొన్న లయన్స్‌క్లబ్ గవర్నర్ ఈశ్వర్‌కుమార్, లయన్స్ డిస్ట్రిక్ట్ అడ్వైజర్ డాక్టరు బాదం బాలకృష్ణ జల కాలుష్యం నివారించేందుకు బీచ్‌లో వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పద్మతులసి చేపట్టిన క్లీన్ బీచ్ కార్యక్రమం ఉపయోగకరమన్నారు. రీజియన్ చైర్‌పర్సన్ లయన్ పద్మతులసి మాట్లాడుతూ తమ రీజియన్ పరిధిలోని లయన్స్ క్లబ్ సభ్యులతో పెద్ద ఎత్తున క్లీన్ బీచ్ చేపట్టామన్నారు. కార్యక్రమంలో చిట్నీడి శ్రీనివాస్, తలారి రామచంద్రరావు, శివనాగకృష్ణ, ఆదినారాయణరెడ్డి, వీర్రాజు, నమఃశివాయ, నాగమణి పాల్గొన్నారు.

పార్కులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



వాకలపూడి వినాయక రామకృష్ణనగర్‌లో పార్కు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నానాజీ

కాకినాడ రూరల్: వాకలపూడిలోని వినాకయ రామకృష్ణనగర్‌లో 2.4 ఎకరాల ఖాళీ స్థలాన్ని పబ్లిక్ పార్కుగా అభివృద్ధి చేసేందుకు కోరమాండల్ ఎరువుల కర్మాగారం కంపెనీకి చెందిన సీఎస్ఆర్ నిధులు రూ.50 లక్షలతో చేపట్టే పనులకు ఎమ్మెల్యే పంతం నానాజీ శనివారం శంకుస్థాపన చేశారు. భూమి పూజ అనంతరం సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కోరమాండల్ నిధులతో మరికొన్ని పంచాయతీ నిధులు కేటాయించి పార్కు చుట్టూ ప్రహరీ, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తామన్నారు. స్కిల్ డవలప్‌మెంట్ కోసం కలెక్టరు కేటాయించిన స్థలాన్ని పరిశీలించి, అభివృద్ధికి కోరమాండల్ సహకారం కోరారు. కోరమాండల్ సంస్థ ప్రతినిధులు రాజా, శ్రీనివాసరావు, పద్మనాభం, జయగోపాల్, వంశీ, పంచాయతీ కార్యదర్శి పాండురంగారావు, రామకృష్ణనగర్ కాలనీ అసోసియేషన్ సభ్యులు నున్న వెంకటేశ్వరరావు, గోనేల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బాణసంచా సీజ్

కరప: గొర్రిపూడిలో కరప పోలీసులు దాడులు నిర్వహించి, అక్రమంగా నిల్వచేసిన బాణ సంచాను సీజ్ చేసి, నిందితునిపై కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన కథనం మేరకు కరప మండలం గొర్రిపూడిలో అనధికారికంగా బాణసంచా తయారుచేస్తూ, అక్రమ నిల్వలు ఉన్నట్టు పోలీసులకు సమాచారం అందింది. కరప ఎస్సై టి.సునీత, అదనపు ఎస్సై ఆర్‌వీఎస్ మూర్తిలు సిబ్బందితో కలిసి శనివారం గొర్రిపూడి వెళ్లి బాణసంచా తయారీ కేంద్రంపై దాడి చేశారు. గండి దుర్గాప్రసాద్ అనుమతుల్లేకుండా నిబంధనలకు విరుద్ధంగా బాణసంచా తయారు చేయడమే కాకుండా, అక్రమంగా నిల్వ ఉంచిన మందుగుండు సామగ్రిని గుర్తించారు. రూ.11,700 విలువచేసే 2,600 చిచ్చుబుడ్లు, 20 కిలోల బొగ్గు, రెండు కిలోల తినే సోడా, ఇతర మందుగుండు సామగ్రిని సీజ్ చేశారు. నిందితుడు దుర్గాప్రసాద్‌ను అరెస్ట్ చేసి కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

వేస్ట్ టు ఎనర్జీకి ఆదిలోనే అవరోధం

- చెత్త నుంచి సంపద తయారీ లక్ష్యంగా ప్రాజెక్టు
- ప్రతిపాదిత స్థలంపై ఎమ్మెల్యే వ్యతిరేకత
- ప్రాజెక్టు భవితవ్యం ప్రశ్నార్థకం



బయోమెథనేషన్ ప్లాంట్ కోసం ప్రతిపాదించిన స్థలం

కాకినాడ: చెత్త నుంచి సంపద తయారీ లక్ష్యంగా ప్రతిపాదించిన 'వేస్ట్ టు ఎనర్జీ' ప్రాజెక్టుకు ఆదిలోనే అవరోధం ఏర్పడే పరిస్థితి నెలకొంది. చెత్త సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించే దిశగా చేపట్టిన ఈ ప్రాజెక్టు స్థల వివాదాన్ని ఎదుర్కొంటోంది. చెత్త నుంచి సంపద తయారీతోపాటు డంపింగ్ సమస్యను నియంత్రించే లక్ష్యంతో ప్రతిపాదించిన ఈ ప్రాజెక్టు పనులకు కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు కొండబాబు అడ్డు చెప్పడంతో నిర్దిష్ట ప్రదేశంలో ప్రాజెక్టు కొనసాగించే అంశంపై సందేహం నెలకొంది. సుమారు రూ.20 కోట్లు ఖర్చు కాగల వేస్ట్ టు ఎనర్జీ ప్రాజెక్టును ఎనర్గాన్ లాజిస్టిక్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ చేపట్టింది. తొమ్మిది నెలల కాల వ్యావధిలో ఈ ప్రాజెక్టును పూర్తిచేసేలా నగర పాలక సంస్థతో ఒప్పందం కుదిరింది. ప్రాజెక్టు కోసం అవసరమైన రెండు ఎకరాల స్థలాన్ని నగరపాలక సంస్థ సమకూర్చింది. చెత్త నుంచి బయోగ్యాస్‌ను ఉత్పత్తి చేసేలా కాకినాడ దుమ్ములపేట ప్రాంతంలో బయోమెథనేషన్ ప్లాంట్‌ను నిర్మించనున్నారు. స్థలాన్ని సమకూర్చిన నగరపాలక సంస్థ రోజూ 40 టన్నుల తడి చెత్తను బయోమెథనేషన్ ప్లాంట్‌కు అందజేయనుంది. దీని ద్వారా రోజుకి రెండు టన్నుల బయోగ్యాస్‌ను ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రాజెక్టుకు అవసరమైన రూ.20 కోట్లను ప్రైవేటు సంస్థ భరించి 20 ఏళ్ల తరువాత ఈ ప్రాజెక్టును స్మార్ట్‌సిటీకి అప్పగించేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇందుకు సంబంధించి రెండు రోజుల క్రితం భూమి పూజ కూడా చేశారు.

స్థలంపై వివాదం

బయోమెథనేషన్ ప్లాంట్ ఏర్పాటు కోసం దుమ్ములపేటలో కేటాయించిన రెండు ఎకరాల స్థలాన్ని ఎమ్మెల్యే వనమాడి కొండబాబు వ్యవతిరేకిస్తున్నారని ప్రచారం జరుగుతోంది. అక్కడ ఏర్పాటు చేసే విషయంలో అధికారులతో విభేదించిన కొండబాబు భూమి పూజకు కూడా డుమ్మా కొట్టారు. గత ప్రభుత్వ హయాంలో టీడీఆర్ బాండ్లు ద్వారా ఈ స్థలాన్ని సేకరించారు. నగర పరిధిలో అందుబాటులో ఉన్న కార్పొరేషన్ స్థలంలో ఈ ప్రాజెక్టు అమలు చేయాలన్న నగరపాలక సంస్థ ప్రయత్నం ఎంత వరకు సఫలీకృతం అవుతుందో వేచి చూడాలి.

పనులు వేగవంతం చేస్తాం

బయోమెథనేషన్ ప్లాంట్ పనులను వేగవంతం చేస్తాం. ప్రతిపాదిత స్థలంలోనే బయోమెథనేషన్ ప్లాంట్ పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే భూమి పూజ పూర్తి పూర్తయ్యింది. త్వరలోనే పనులు కూడా ప్రారంభమవుతాయి. ఆ మేరకు పనులు వేగవంతమయ్యేలా పర్యవేక్షిస్తాం.

– కామేశ్వరరావు, ఎస్ఈ, నగరపాలక సంస్థ

రైతు బజార్‌లోని సమస్యలు పరిష్కరించాలి



జేసీ రాహుల్ మీనాకు సమస్యలు వివరిస్తున్న రైతు బజార్‌లోని రైతులు

కాకినాడ సిటీ: కాకినాడ ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో రైతు బజార్‌లోని సమస్యలు పరిష్కరించాలని రైతులు కోరారు. శనివారం కలెక్టరేట్‌లో జేసీ రాహుల్ మీనాను వారు కలిసి రైతు బజార్‌లో నెల కొన్న సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాటిని పరిష్కరించి తమ వ్యాపారాలు సక్రమంగా చేసుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తాము కష్టపడి వ్యాపారాలు చేసుకుంటేనే కుటుంబాలు గడుస్తాయని జేసీకి రైతులు వివరించారు. పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. రైతులు సమస్యలపై జేసీ రాహుల్ మీనా సానుకూలంగా స్పందించి తగు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు బజార్‌లోని రైతులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యపై వేగంగా స్పందించాలి



జిల్లాస్థాయి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న జేసీ కలెక్టర్ రాహుల్ మీనా

కాకినాడ సిటీ: ప్రజాసమస్యపై వేగంగా స్పందించి త్వరితగతిన పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా అన్నారు. శనివారం కాకినాడ కలెక్టరేట్ వివేకానంద సమావేశపు మందిరంలో ప్రజా ఫిర్యాదులపై జిల్లాస్థాయి కమిటీ సమావేశాన్ని జేసీ రాహుల్ మీనా, ట్రైనీ కలెక్టర్ భావన, వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులతో కలిసి నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా వివిధ శాఖలకు వచ్చిన దరఖాస్తులు– పరిష్కరించినవి వాటిపై సమీక్షించారు. పరిష్కరించక పోవడానికి గల కారణాలన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించారు. వీటిపై సంబంధిత అధికారులను జేసీ రాహుల్ మీనా వివరణ అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రవేశపెట్టిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో అందిన అర్జీలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రతి సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అందిన అర్జీలను ఆయా శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి, శాశ్వత పరిష్కారానికి కృషి చేయాలని జేసీ ఆదేశించారు. ఈ సమావేశంలో ప్రతి ఒక్క ఫిర్యాదును పరిశీలిస్తామని జేసీ తెలిపారు. ప్రతి ఒక్క ఫిర్యాదుపై పూర్తి అవగాహనతో సంబంధిత అధికారులు సమావేశానికి హాజరుకావాలని జాయింట్ కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బాధితులకు మాజీ మంత్రి కన్నబాబు పరామర్శ



కాకినాడ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కార్తీక్‌ను పరామర్శిస్తున్న మాజీ మంత్రి కన్నబాబు

కరప: కాకినాడ రూరల్ మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు శనివారం కాకినాడ ప్రభుత్వాస్పత్రికి వెళ్లి బాధితులను పరామర్శించారు. కరప మండలం జి.భావారం గ్రామానికి చెందిన పార్టీ కార్యకర్త తాతపూడి కార్తీక్ రోడ్డు ప్రమాదానికి గురై గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడిని మాజీ మంత్రి కన్నబాబు పరామర్శించి, ధైర్యం చెప్పారు. పెనుగుదురు గ్రామ జనసేన నాయకులు వేధింపులు భరించలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ కోలుకుంటున్న పులపకూర సునీతను కన్నబాబు పరామర్శించారు. మండల పార్టీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, పార్టీ నాయకులు రొక్కాల తారకేష్, మూరా అవినాష్, మార్రెళ్ల వెకటరమణ, వజ్రపు కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన, చిత్రలేఖన పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ



వ్యాసరచన పోటీల్లో ప్రథమస్థానం పొందిన నవ్యశ్రీతో జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): స్థానిక పీఆర్ బాలికోన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న బి.దాలిసత్యహేమను కలెక్టర్ షణ్మోహన్ అభినందించారు. గత నెలలో నిర్వహించిన సేవ్ ద గరల్, చైల్డ్ అనే అంశం సత్యహేమ గీసిన చిత్రలేఖనం జిల్లా స్థాయిలో ప్రథమస్థానం సాధించిన విషయం తెలిసిందే. శనివారం కలెక్టర్ చేతుల మీదుగా రూ.5వేలు క్యాష్ అవార్డు, సర్టిఫికెట్‌ను సత్యహేమ అందుకుంది. అదేవిధంగా స్వచ్ఛతాయే సేవా అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో పాఠశాలకు చెందిన నవ్యశ్రీ ప్రథమస్థానం పొంది శనివారం జిల్లా విద్యాశాఖ అధికారి పి.రమేష్ చేతుల మీదుగా బహుమతి అందుకుంది. ఈ విద్యార్థినులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు శనివారం సిబ్బంది అభినందించారు.

ప్రత్యేక కౌంటర్లలో వంట నూనెల విక్రయం

కాకినాడ సిటీ: వినియోగదారులకు అనువైన ధరలకు నిత్యవసర వస్తువులు అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకున్నట్లు జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర పౌరసరఫరా శాఖ మంత్రి, రాష్ట్రస్థాయి అధికారులు, ఎడిబుల్ ఆయిల్ కంపెనీ ప్రతినిధులు, హోల్‌సేల్ డీలర్ల అసోసియేషన్, పెద్ద చైను రిటైలర్లతో మాట్లాడి వంట నూనెలు అమ్మేందుకు స్పెషల్ కౌంటర్లు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. స్పెషల్ కౌంటర్లలో పామాయిల్ (850 గ్రాములు) ధర రూ. 110, సన్‌ఫ్లవర్ ఆయిల్ (910 గ్రాములు) ధర 124 రూపాయలకు అమ్మే విధంగా నిర్ణయించినట్లు తెలిపారు. జిల్లాలో ప్రత్యేక కౌంటర్ల ద్వారా జిల్లాలో ఉన్న రైతు బజార్లు, మార్కెట్లలో విక్రయించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. హోల్‌సేల్ దుకాణాలు, డీమార్ట్, రిలయన్స్ నుంచి కూడా వినియోగదారులు పై ఉదాహరించిన ధరలకు పొందవచ్చన్నారు. ప్రత్యేక కౌంటర్లలో ఆయిల్ పొందేందుకు వినియోగదారులు తప్పనిసరిగా తెల్లరేషన్‌కార్డును తీసుకొని వెళ్లాలన్నారు. మొబైల్ కెమెరా ఉన్న స్కానర్‌ను ఉపయోగించి దుకాణం వద్ద ఉన్న క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేసి, రేషన్‌కార్డు నంబర్ నమోదు చేయాలన్నారు. ప్రభుత్వం నిర్దేశిత ధరలకు కాకుండా ఎవరైనా ఎక్కువ ధరలకు నూనెలు విక్రయించినా, నిబంధనలు పాటించకుండా నూనె నిల్వలు ఎక్కువగా ఉంచినా చర్యలు తీసుకుంటామని జేసీ హెచ్చరించారు.

పైపులైన్ లీకేజీ.. స్తంభించిన ట్రాఫిక్



కరపలో మంచినీటి పైపులైన్ లీకేజీ నుంచి ఎగజిమ్ముతున్న నీరు, స్తంభించిన ట్రాఫిక్

కరప: గ్రామంలోని సామూహిక రక్షిత మంచినీటి పైపు లీకవ్వడంతో మెయిన్ రోడ్డుపై నీరు నిలిచిపోయి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో వాహన చోదకులు, పాదచారులు ఇబ్బందులకు గురయ్యారు. మండలం పెనుగుదురులోని కేఎంజే పంట కాలువ నుంచి పైపులైన్ ద్వారా కరపలోని సామూహిక రక్షిత మంచినీటి చెరువుకు నీటిని తోడుతారు. అక్కడ నుంచి నీటిని శుభ్రపరచి 8 గ్రామాలకు రక్షిత మంచినీటిని సరఫరా చేస్తారు.పెనుగుదురు నుంచి వచ్చే మంచినీటి పైపులైన్‌కు కరప మెయిన్ రోడ్డులో మలుపు వద్ద శనివారం రంధ్రం పడి ఒక్కసారిగా పొంటైన్ను తలపిస్తూ నీరు పైకి ఎగజిమ్మింది. వివిధ వాహనాలు, పాదచారుల రాకపోకలతో నిత్యం రద్దీగా ఉండే కరప మెయిన్‌రోడ్డులో అరగంట పాటు ట్రాఫిక్ స్తంభించింది. ఈ విషయం తెలుసుకున్న సర్పంచ్ సాదే ఆశాజ్యోతి వెంటనే ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ వీఎస్ వర్ధన్‌కు ఫోన్ చేసి, పైపులైన్ లీక్ గురించి తెలిపారు. ఏఈఈ స్పందించి సిబ్బందిని పెనుగుదురు పంపించి పైపులైన్‌లోకి నీరు రాకుండా ఆపించి వేశారు. పైపులైన్ లీక్‌ను అరికట్టి మంచినీటి సరఫరాను పునరుద్ధరిస్తామని ఏఈఈ తెలిపారు.

డీఆర్వోకు ఘన సత్కారం



డీఆర్వో తిప్పేనాయక్‌ను సత్కరిస్తున్న కలెక్టర్ షణ్మోహన్, జేసీ రాహుల్ మీనా

కాకినాడ సిటీ: కాకినాడ జిల్లా రెవెన్యూ అధికారిగా డి తిప్పేనాయక్ తొమ్మిది నెలల పాటు ఉత్తమ సేవలు అందించారని కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి అన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేయడంతో శనివారం సాయంత్రం కలెక్టరేట్‌లో డీఆర్వో తిప్పే నాయక్‌కు కలెక్టరేట్ అధికారులు సిబ్బంది వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన జిల్లా కలెక్టర్ షణ్మోహన్, జేసీ రాహుల్ మీనా, ట్రైనీ కలెక్టర్ హెచ్ఎస్ భావన ఇతర అధికారులు డీఆర్వో తిప్పేనాయక్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలో ఎస్ మల్లిబాబు, కె శ్రీరమణి, జిల్లాస్థాయి వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ పరిపాలనాధికారి రామమోహన్‌రావు, వివిధ విభాగాల అధిపతులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీఎస్పీ బెటాలియన్‌లో ఓపెన్ హౌస్



ఏపీఎస్పీ బెటాలియన్ క్యాంప్‌లో మాట్లాడుతున్న అడిషనల్ కమాండెంట్ దేవానందరావు

కాకినాడ రూరల్: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా రమణయ్యపేటలోని ఏపీఎస్పీ క్యాంప్‌లో శనివారం విద్యార్థులకు ఓపెన్ హౌస్ నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న అడిషనల్ కమాండెంట్ ఎస్.దేవానందరావు మాట్లాడుతూ విద్యార్థులకు పోలీసులు విధులు, వినియోగించే వాహనాలు, తదితర వాటిపై విద్యార్థులు, ఎన్‌సీసీ కేడెట్లకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ద్వారా విద్యార్థులకు పోలీసు విధుల పట్ల ఆసక్తిని పెంపొందించవచ్చన్నారు. ఓపెన్ హౌస్‌లో ఆయుధాల పనితీరును తెలియజేయడంతో పాటు ఏపీ ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బంది ప్రకృతి వైపరీత్యాల్లో అందించే సేవలు, ఉపయోగించే సామగ్రిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ మురళీ కుమార్, ఆర్‌ఐలు రామకృష్ణ, విఠలేశ్వరరావు, రవి శంకర్, రాము, శ్రీనివాసరావు, అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఫౌండేషన్‌కు నిధులు సమకూర్చాలి



లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ సెమినార్‌ను ప్రారంభిస్తున్న అంబటి సుధాకర్‌రెడ్డి

బోట్‌క్లబ్: లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్‌కు పెద్ద ఎత్తున నిధులు సమకూర్చడం ద్వారా జిల్లా వ్యాప్తంగా చేపట్టిన రూ. 1.30 కోట్లతో శాశ్వత ప్రాజెక్టులకు అవసరమైన నిధులు లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ద్వారా సాధించుకోవచ్చునని ఫౌండేషన్ ఏరియా లీడర్ అంబటి సుధాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక విద్యుత్‌నగర్ చల్లా ఫంక్షన్‌హాల్‌లో శనివారం లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ కాన్‌ఎన్‌క్లేవ్ 2024 సెమినార్‌ను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. లయన్స్ క్లబ్ సంకల్ప్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి క్లబ్ జిల్లా గవర్నర్ ఈశ్వర్‌కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెట్టారాధ లీడర్ షిప్‌లో డిస్ట్రిక్ట్ క్లబ్‌లు అద్భుతంగా స్పందించి ఇచ్చిన లక్ష్యాలను పూర్తి చేయడం అభినందనీయమన్నారు. మనం ఇచ్చిన నిధులు ఆధారంగా ఇటీవల విజయవాడ వరద బాధితుల కోసం పెద్ద ఎత్తున ఫౌండేషన్ నిధులు మంజూరు చేసిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ మాజీ గవర్నర్ బాదం బాలకృష్ణ, లింగమల్లు కృష్ణమూర్తి, వైస్ గవర్నర్ చిట్నీడి శ్రీనివాస్, లయన్స్ క్లబ్ సంకల్ప్ అధ్యక్షురాలు లక్ష్మీలావణ్య, సభ్యులు గోపాలరావు పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్యాలు పెంచుకోవాలి

బాలాజీచెరువు: వృత్తి నైపుణ్యాలు పెంపొందించుకోవడం ద్వారా ఉపాధి అవకాశాలు విస్తతంగా ఉంటాయని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ పేర్కొన్నారు. కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో కళాశాలలో శనివారం 2024లో ఉత్తీర్ణులైన ఐటీఐ విద్యార్థులకు కాన్వకేషన్ నిర్వహించి సర్టిఫికెట్లు అందజేశారు. ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ ఎంవీజీ వర్మ మాట్లాడుతూ గతేడాది ఆలిండియా ట్రేడ్ టెస్ట్‌లో జాతీయస్థాయిలో ఇద్దరు విద్యార్థులు డ్రాఫ్ట్‌మెన్ సివిల్, ఎలక్ట్రానిక్ మెకానిక్ విభాగంలో ప్రథమ ర్యాంకు సాధించడం కళాశాలకే గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎంసీ చైర్మన్ కాకర్ల రామకృష్ణ, సూపరింటెండెంట్ మంగతాయారు, మోహనరావు, డేవిడ్ పాల్గొన్నారు.

గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలి

కరప: భూ సమస్యలు పరిష్కరించేందుకు నిర్వహిస్తున్న గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఎస్.సత్యనారాయణ అన్నారు. మండలం కూరాడ శివారు చినమామిడాడలో శనివారం నిర్వహించిన రీసర్వే–గ్రామసభ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతులు తమ భూములకు సంబంధించి ఎటువంటి సమస్య ఉన్నా, రికార్డుల్లో, పాసు పుస్తకాల్లో వ్యత్యాసాలు తదితర సమస్యలపై గ్రామసభలో దరఖాస్తు అందిస్తే, సర్వేచేసి దోషాలను సరిచేస్తామన్నారు. ఈ సందర్భంగా చినమామిడాడలో భూముల్లో వ్యత్యాసంపై 33, మ్యూటేషన్ 5, జాయింట్ ఎల్‌పీఎంఎస్ 34, తప్పులు సవరణకు 2, ఇతర సమస్యలపై 7 వంతున పరిష్కారం కోరుతూ 81 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నట్టు తహసీల్దార్ సత్యనారాయణ తెలిపారు. రీసర్వే డీటీ డి.దుర్గాప్రసాద్, మండల సర్వేయర్ ఎస్.రూపవతి, ఆర్‌ఐ పవన్‌కుమార్, కూరాడ, అరట్లకట్ట వీఆర్వో టేకుమూడి శ్రీనివాసరావు, శ్రీనివాస సత్యహరిశ్చంద్రప్రసాద్ పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్లతో బాధ్యతగా మెలగాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సూర్యనారాయణమూర్తి

కాకినాడ సిటీ: ప్రతి ఒక్కరూ సీనియర్ సిటిజన్లతో బాధ్యతగా మెలగాలని, గౌరవంతో పెద్దలను చూడాలని, అదే విధంగా తల్లిదండ్రుల పట్ల ప్రేమానురాగాలు పెంపొందించుకునే విధంగా విద్యార్థులు తమ ప్రవర్తనను అలవర్చుకోవాలని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు బి సూర్యనారాయణమూర్తి ఉద్బోధించారు. శనివారం కాకినాడ జగన్నాథపురంలోని ఏఎస్‌డీ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు నిర్వహించిన ప్రత్యేక అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. వృద్ధులు ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కొనకుండా కుటుంబ సభ్యులు తమ సంక్షేమం చూసుకునే విధంగా కేంద్ర ప్రభుత్వం 2007లో చట్టాలు చేసిందని, ఏపీ ప్రభుత్వం 2011లో ప్రత్యేక ట్రిబ్యునల్ ఏర్పాటు చేసిందన్నారు. విద్యార్థి దశ నుంచే సీనియర్ సిటిజన్స్, వృద్ధులైన తల్లిదండ్రులు, తాతలు, నాయనమ్మ, అమ్మమ్మలను గౌరవంగా చూడాలని అవగాహన కల్పించారు. చట్టాల్లో ఉన్న పలు అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు వి రామసుబ్బారావు, ఎస్వీ ప్రసాద్ జక్కా, ఏ సత్యనారాయణ, ఏడీ ఆఫీసు సూపరింటెండెంటు యు రాజు, కాలేజీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతు బజార్‌లో ధర్నాలతో ప్రజలకు ఇక్కట్లు



జేసీ రాహుల్‌మీనాకు వినతిపత్రం అందజేస్తున్న దూసర్లపూడి రమణరాజు

బోట్‌క్లబ్: రైతుబజార్‌లో సమస్యలుంటే కలెక్టర్ కార్యాలయం వద్దకు వెళ్లి ధర్నాలు చేయాలి తప్ప, రైతు బజారుకు వచ్చే కొనుగోలుదారులను ఇక్కట్లకు గురి చేసే విధంగా అక్కడి వ్యాపారులు చేస్తున్న ఆందోళనలు ఎంత మాత్రం తగవని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు అన్నారు. ప్రైవేటు వ్యక్తులు ప్రవేశించి రైతు బజార్‌లో ధర్నాల వెనుక రాజకీయ దళారీలు, రైతు బజార్ అధికారుల ప్రమేయం ఉందన్నారు. ఈ మేరకు శనివారం జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనాను కలిసి వినతిపత్రం అందజేశారు. ఇంగ్లీష్ కాయగూరల రైతులు వైఎస్సార్‌సీపీ ద్వారా లబ్ధి పొందారని పేర్కొంటున్న ఆరోపణలు పూర్తి అవాస్తవమన్నారు. ఇంగ్లీష్ కాయగూరలు విక్రయించే రైతులకు అద్దె ప్రాతిపదికన రాష్ట్ర వ్యాప్తంగా అన్ని రైతు బజార్లలో నిర్దిష్ట స్థలాలు కేటాయించారన్నారు. పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్‌వీఎస్ వర్మ వర్గానికి చెందిన కొంతమంది పిఠాపురంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో అధికారులను తప్పు దారి పట్టించే ఫిర్యాదు అందించారన్నారు. కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ అనుచర బంధు వర్గం పేరుతో హడావుడి చేస్తున్నారని అన్నారు. సిటీ పరిధిలోని రైతు బజార్‌లోని పేద యువ రైతు డేగల జగదీష్‌ను కాయగూరల స్టాల్స్ నుంచి రెండు రోజుల క్రితం అనుచితంగా తరిమేశారన్నారు. అతనికి అధికారులు యథాస్థానం కేటాయించాలని కోరారు. చనిపోయిన రైతు కుటుంబాలకు దుకాణాలు కేటాయించకుండా అనుచిత పద్ధతిలో వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. గురువారం ఇంగ్లీష్ కాయగూరల రైతులకు, ఇతర కాయగూరలు, ఆకుకూరల వ్యాపారుల నడుమ గొడవలు సృష్టించేందుకు ప్రయత్నించారని అన్నారు. శుక్రవారం బజారులో ధర్నా కారణంగా వినియోగదారులు ఇక్కట్లకు గురయ్యారని అన్నారు. రైతు బజార్‌లో నిజమైన రైతులను గుర్తించి బినామీల దుకాణాలు తొలగించాలని ఆయన కోరారు.

వైద్య వృత్తికి సమాజంలో అధిక ప్రాధాన్యత



జ్యోతిప్రజ్వలన చేస్తున్న లక్ష్మి దుగ్గిరాల, చిత్రంలో డాక్టర్ విష్ణువర్ధన్ తదితరులు

కాకినాడ క్రైం: వైద్య వృత్తికి సమాజంలో అధిక ప్రాధాన్యత ఉందని డాక్టర్ ఎన్టీఆర్ యూహెచ్ఎస్ వీసీ, ఏపీ డీఎంఈ, ఆర్ఎంసీ వైద్య ప్రిన్సిపాల్ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం అన్నారు. కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలోని ఫిజియాలజీ లెక్చర్ గ్యాలరీలో శనివారం వైట్ కోట్ సెర్మని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఎస్‌వీఎల్ నరసింహం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణువర్ధన్ ఆధ్వర్యం వహించారు. విశిష్ట అతిథిగా ఇన్‌ఆర్ట్‌మాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు, చైర్మన్ లక్ష్మి దుగ్గిరాల నూతన విద్యార్థులకు నైతికత అంశంపై అవగాహన కల్పించారు. ఆమె చేతుల మీదుగా పలువురు విద్యార్థులకు వైట్‌కోట్ ధరింపజేశారు. ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శశి, జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ శ్రీనివాస్, డాక్టర్లు భాగ్యలక్ష్మి, విఠల్, యశోదమ్మ, డాక్టర్ ప్రమోదిని, క్యాంపస్ ఆఫీసర్ డాక్టర్ సతీష్, 2021 బ్యాచ్ విద్యార్థులు పాల్గొన్నారు.

అక్కు కబడ్డీ టోర్నీ విజేత ఐడియల్ జట్టు



అక్కు కబడ్డీ పోటీల్లో విజేతగా నిలిచిన ఐడియల్ జట్టు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఆదికవి నన్నయ యూనివర్సిటీ అంతర్ కళాశాలల కబడ్డీ పోటీల విజేతగా కాకినాడ ఐడియల్ కళాశాల జట్టు నిలిచిందని ప్రిన్సిపాల్ టి.సత్యనారాయణ శనివారం తెలిపారు. మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన పోటీల్లో ఐడియల్ కళాశాల జట్టు ప్రతిభ కనపరచడం అభినందనీయమన్నారు. ఈనెల 30 నుంచి నవంబరు 3 వరకు నిర్వహించనున్న సౌత్ ఇండియా అంతర్ కళాశాల పోటీలకు కళాశాల నుంచి దుర్గాప్రశాంత్, హరిష్, శ్రీహరి, సూర్యచంద్ర ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులను కరస్పాండెంట్ డాక్టర్ పి.చిరంజీవినీ కుమారి, అధ్యాపకులు అభినందించారు.